# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-04-2024** **సమయం : 1.40 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో రికార్డు స్థాయిలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.**

**2.** **వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈరోజు కృష్ణాజిల్లా కేసరపల్లి నుండి ప్రారంభమయింది.**

**3.** **18 సంవత్సరాల వయసు నిండి.. ఓటర్ జాబితాలో పేరులేని వారంతా ఈరోజులోగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు.**

**4.** **పేదల సంక్షేమం, మధ్యతరగతి ప్రజల అభివృద్ధి లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల హామీలను రూపొందించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరీ పేర్కొన్నారు.**

5. **ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ పరీక్ష ఫీజు చెల్లించవచ్చని రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు ప్రకటించింది.**

==========================

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో రికార్డు స్థాయిలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇప్పటికే గత ఎన్నికల రికార్డును అధిగమించి నగదును స్వాధీనం చేసుకున్నామని, 75 ఏళ్ళ లోక్ సభ ఎన్నికల చరిత్రలో ఇదే అత్యధికమని పేర్కొంది. మార్చి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 4 వేల 650 కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని, సగటున ప్రతిరోజూ వంద కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలియజేసింది.

ఇలా ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటివరకు 32 కోట్ల 15 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలియజేసింది.

--------------------------

వై. ఎస్ .ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్. జగన్ మోహన రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈరోజు కృష్ణాజిల్లా కేసరపల్లి నుండి ప్రారంభమయింది. గన్నవరం, ఆత్కూర్, వీరవల్లి క్రాస్, హనుమాన్ జంక్షన్ మీదుగా ఈ యాత్ర జొన్నపాడు చేరుకుంటుంది. సాయంకాలం 4 గంటలకు నాగవరప్పాడు చేరుకొని అక్కడ జరిగే బహిరంగ సభలో జగన్ మోహన రెడ్డి పాల్గొంటారు. ఆ తరువాత తిరిగి హనుమాన్ జంక్షన్‌కు

చేరుకుని ... కలపర్రు మీదుగా రాత్రికి యాత్ర ఏలూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

---------------------------

రాష్ట్ర ముఖ్య మంత్రి, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఇటీవల జరిగిన దాడి ఘటన నేపథ్యంలో ఆయన భద్రతలో మార్పులు, చేర్పులు చేశారు. ప్రస్తుత భద్రతకు అదనంగా సెక్యూరిటీని ఏర్పాటు చేయగా..జగన్ మోహన రెడ్డిచేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర మార్గాల్లో డీఎస్పీలతో భద్రత కల్పిస్తారు. యాత్ర జరిగే మార్గాలను సెక్టార్లుగా విభజించి.. సెక్టార్ కు ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలతో భద్రత కల్పిస్తారు. ఇకపై నిర్దేశించిన ప్రాంతాల్లోనే రోడ్ షోలు, సభలు ఉండనుండగా.. గజమాలలు, పువ్వులు విసరడంపై ఆంక్షలు అమల్లో ఉంటాయి.

ఇలా ఉండగా.. జగన్మోహన్ రెడ్డి కాన్వాయ్‌కి భద్రత సిబ్బంది అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

---------------------------

18 సంవత్సరాల వయసు నిండి.. ఓటర్ జాబితాలో పేరులేని వారంతా ఈరోజులోగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. ఆన్‌లైన్ ద్వారా గానీ, సంబంధిత రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో గానీ ఫారం-6ను సమర్పించడం ద్వారా ఈ నెల 15లోగా ఓటు హక్కు నమోదు చేసుకున్నవారందరికీ తప్పకుండా ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు కావడమే కాకుండా మే 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

పేదల సంక్షేమం, మధ్యతరగతి ప్రజల అభివృద్ధి లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల హామీలను రూపొందించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరీ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఆమె ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రజల అభీష్టాలకు అనుగుణంగా... కోటి సూచనలను క్రోడీకరించి తమ పార్టీ మ్యానిఫెస్టోను రూపొందించిందని, దానిని అమలు చేసే నాయకత్వం బీజేపీకి ఉందని పేర్కొన్నారు. గత 9 ఏళ్ళుగా దేశంలో సుపరిపాలన జరుగుతోందని, అందులో భాగంగానే డిజిటల్ చెల్లింపులు వంటి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయని పురందేశ్వరీ పేర్కొన్నారు.

---------------------------

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 18 నుంచి 24 వరకూ పరీక్ష ఫీజు చెల్లించేందుకు రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. జనరల్, వృత్తి విద్యాకోర్సుల పరీక్షలకు 550 రూపాయలు, ప్రాక్టికల్స్‌కు 250 రూపాయలు, బ్రిడ్జి కోర్సు, పేపర్లు రాసేందుకు 150 రూపాయలు చెల్లించాలని సూచించింది. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మార్కుల పెరుగుదలకు, మళ్ళీ పరీక్షలు రాయాలనుకుంటే పరీక్ష ఫీజు 550 రూపాయలతో పాటు అదనంగా ఒక్కో పేపర్‌కు 160 రూపాయలు చొప్పున చెల్లించాలని తెలిపింది. జవాబు పత్రాల రీవెరిఫికేషన్‌కు 13 వందల రూపాయలు, రీకౌంటింగ్‌కు 260 రూపాయల చొప్పున చెల్లించాలని సూచించింది.

---------------------------

రాష్ట్రంలో నిన్న అర్ధరాత్రి నుండి సముద్రంలో చేపల వేట నిషేధం అమలులోకి వచ్చింది. జూన్ 14 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.సముద్రంలోని చేపలు గుడ్లు పెట్టే సమయం కనుక ప్రతి ఏటా ఏప్రిల్ 14వ తేదీ అర్ధరాత్రి నుంచి 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటను ప్రభుత్వం నిషేధిస్తుంది. ప్రకాశంజిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఏ.చంద్రశేఖర్ రెడ్డి జిల్లాలో చేపల వేట నిషేధం గురించి ఆకాశవాణితో మాట్లాడుతూ, జిల్లా పరిధిలో 51 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉందని ఇందులో 75 మత్స్యకార గ్రామాలు ఉన్నాయని తెలిపారు. దాదాపు 10వేల మంది మత్స్యకారులు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చంద్రశేఖర్ రెడ్డి వివరిస్తూ...

...వాయిస్... 32 సెకన్లు.....

---------------------------

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మే 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరగనుంది. 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. దరఖాస్తు చేసుకున్నవారికే ఈ అవకాశం కల్పించనున్నారు. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, కేంద్ర సర్వీసుల్లోని సిబ్బంది, దివ్యాంగులు కూడా పోస్టల్ ఓటును వినియోగించుకోనున్నారు.

---------------------------

పారదర్శక, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీసులు ప్రజలకు అండగా ఉంటారని ప్రకాశం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. ఒంగోలులో నిన్న 300 మంది కేంద్ర సాయుధ బలగాలు, సివిల్ పోలీస్‌లతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పాత్రికేయిలతో మాట్లాడుతూ, ప్రజల్లో ఉన్న భయాందోళలనలు పోగొట్టి, స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని తెలిపారు. దీనిలో భాగంగానే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామనీ, ఎక్కడైనా ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉన్నా ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

---------------------------

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంకాలం రాజాం వద్ద రోడ్ షోలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా పలాస చేరుకుంటారు.

---------------------------

రైల్వేశాఖలో 4 వేల 660 ఉద్యోగాలకు తాజాగా నోటిఫికేషన్ విడుదల అయింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆర్‌పిఎఫ్ , రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌లో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఈరోజు నుంచి మే 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

---------------------------

ఈ ఏడాది అమర్నాథ్ యాత్ర జూన్ 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ బోర్డు ప్రకటించింది. 52 రోజుల పాటు సాగే ఈ యాత్రకు ఈ రోజు నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో

రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునీ. పూర్తి వివరాలకు www.jksasb.nic.in వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చునీ బోర్డు తెలిపింది. కాగా ఈ యాత్రకు 13 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు గల వారినే అనుమతిస్తారు.

---------------------------

ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఈరోజు బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఈరోజు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడి మూడు మ్యాచ్‌లను గెలిచిన హైదరాబాద్ జట్టు మరో విజయం కోసం ఎదురు చూస్తుండగా.. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒక మ్యాచ్ మాత్రమే గెలిచి చివరి స్థానంలో ఉన్న బెంగుళూరు జట్టు ఈరోజు జరిగే మ్యాచ్‌లో విజయం సాధించాలని దృఢంగా భావిస్తోంది.

---------------------------

హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు కర్నూలు నగరంలో పర్యటించనున్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జోహారపురంలో ఈ సాయంకాలం జరగనున్న ర్యాలీలో ఆయన పాల్గొంటారు. ర్యాలీ అనంతరం కొండా రెడ్డి బురుజు వద్ద ప్రజలనుద్దేశించి బాలకృష్ణ ప్రసంగించనున్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో ఈరోజు, రేపు తీవ్ర వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు 31 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 139 మండలాల్లో వడగాల్పులు.. రేపు 33 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 113 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు తెలియచేసింది. నిన్న నంద్యాల జిల్లా గోస్పాడులో 43.4 డిగ్రీలు, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 43.3 డిగ్రీలు, ఆముదాలవలసలో 42.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొంది.

=====================